

క్షుద్ర పూజల కలకలం

- అప్పన్నపల్లి అడవిలో ఘటన
- రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చిన గ్రామస్థులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. చీటింగ్ కేసు నమోదు

4

వాటా రక్తంతో.. వ్యాపారం



- ప్రభుత్వ ఆస్పత్రికి 30 శాతం రక్తం ఇవ్వని బ్లడ్ బ్యాంకులు
- పాలమూరులో మూడు రక్త నిధి సేకరణ కేంద్రాలు
- మూడేళ్లలో ఆస్పత్రికి రావాల్సిన యూనిట్లు 5,773
- దవాఖానాలో రక్తం లేక పేదల ఇక్కట్లు

ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు దాతలు రక్తదానం చేస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు రక్తదాన శిబిరాలు నిర్వహించి, వారి నుంచి రక్తాన్ని సేకరిస్తున్నాయి. అయితే ఇలా రక్తదాన శిబిరాల ద్వారా వచ్చిన రక్తం యూనిట్లలో 30 శాతం ప్రభుత్వ ఆస్పత్రికి ఇవ్వాలని నిబంధన ఉంది. కానీ.. జిల్లాలోని ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు ఆ నిబంధనను పట్టించుకోవడం లేదు. మూడేళ్లుగా 30 శాతం వాటా ఇవ్వడం లేదు. ఈ మూడేళ్లలో ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు నిర్వహించిన రక్తదాన శిబిరాల ద్వారా 5,773 యూనిట్ల రక్తం సర్కారు ఆస్పత్రికి రావాల్సి ఉంది. ఆ యూనిట్లను కూడా అమ్ముకుని, రూ.80 లక్షల దందా చేయడం గమనార్హం.

- మహబూబ్‌నగర్(వైద్యవిభాగం)

మహబూబ్‌నగర్ జిల్లాలోని బ్లడ్ బ్యాంకులు ప్రభుత్వ ఆస్పత్రికి ఇవ్వాల్సిన వాటా రక్తం ఇవ్వడం లేదు. జిల్లా వ్యాప్తంగా రెడ్‌క్రాస్, పాలమూరు, ఎస్వీఎస్ ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి. ఆయా బ్లడ్ బ్యాంకులు ప్రైవేటుగా రక్తదాన శిబిరాలను నిర్వహించి, రక్తం యూనిట్లు సేకరించేందుకు స్టేట్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ కౌన్సిల్ ద్వారా అనుమతి తీసుకోవలసి ఉంటుంది. వారు ఇచ్చే అనుమతిలో శిబిరాల ద్వారా సేకరించిన రక్తం యూనిట్లలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి 30 శాతం వాటా ఇవ్వాలనే నిబంధన ఉంటుంది. కానీ ఏ ఒక్క బ్లడ్ బ్యాంకు ఈ నిబంధనను అమలు చేయడం లేదు. ఆ 30 శాతాన్ని కూడా బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నాయి.

లేఖలు రాస్తున్నా స్పందించడం లేదు



నిబంధనల ప్రకారం ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు జనరల్ ఆస్పత్రికి 30 శాతం రక్తం యూనిట్లు ఇవ్వాల్సిందే. కానీ ఆ నిబంధనలను ఏ బ్లడ్ బ్యాంకూ పట్టించుకోవడం లేదు. వాటా ఇవ్వాలని ప్రతీ నెల లేఖలు రాస్తున్నాం. అయినా పట్టించుకోవడం లేదు. వారు 30 శాతం రక్తం వాటా ఇస్తే ఆస్పత్రిలోని నిరుపేదలకు చాలా మేలు జరుగుతుంది.

- డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్



జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు

మూడేళ్లలో బ్లడ్ బ్యాంకులు సేకరించిన రక్తం, ప్రభుత్వ ఆస్పత్రికి ఇవ్వాల్సిన యూనిట్ల వివరాలు

బ్లడ్ బ్యాంక్	నిర్వహించిన శిబిరాలు	సేకరించిన రక్తం యూనిట్లు	ప్రభుత్వ ఆస్పత్రికి ఇవ్వాల్సిన యూనిట్లు
రెడ్‌క్రాస్	261	14,719	4,415
పాలమూరు	106	3,936	1,180
ఎస్వీఎస్	18	589	176





జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకు, రక్తం యూనిట్లు

జనరల్ ఆస్పత్రికి రావలసిన యూనిట్లు 5,773..

జిల్లాలోని మూడు బ్లడ్ బ్యాంకుల్లో 2022 నుంచి 2025 ఏప్రిల్ వరకు మూడేళ్లలో 385 రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల ద్వారా 19,244 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఇందులో జనరల్ ఆస్పత్రికి 30 శాతం వాటా ప్రకారం 5,773 యూనిట్లు రావాల్సి ఉంది. కానీ ఒక్క యూనిట్ కూడా ఇవ్వలేదు.

ప్రభుత్వ వాటా ప్రైవేటుగా విక్రయం..

ప్రభుత్వ ఆస్పత్రికి రావలసిన రక్తం యూనిట్ల వాటాను బ్లడ్‌బ్యాంకులు ప్రైవేటుగా అమ్ముకుంటున్నాయి. ఒక్కో యూనిట్‌కు రూ.1,400 వసూలు చేస్తున్నాయి. ఈ లెక్కన ప్రభుత్వ ఆస్పత్రికి మూడేళ్లలో 30 శాతం వాటా చొప్పున రావలసిన 5,773 యూనిట్లకు గానూ రూ.80,82,200 డబ్బులు ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు సొమ్ము చేసుకున్నాయి.

కలెక్టర్ చొరవ తీసుకుంటే..

ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు ప్రభుత్వ ఆసుపత్రికి రావలసిన 30 శాతం రక్తం యూనిట్లు ఇస్తే ఎంతో మంది నిరుపేదలకు మేలు జరుగుతుంది. జనరల్ ఆస్పత్రికి వచ్చే పేదలు రక్తం నిల్వలు లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా డెలివరీ సమయంలో, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు రక్తం అవసరం చాలా ఉంటుంది.

రక్తం లేకపోవడంతో బయటి బ్లడ్ బ్యాంకుల్లో కొని, ఆర్థికంగా నష్టపోతున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని, ప్రభుత్వ ఆస్పత్రికి రావాల్సిన వాటా వచ్చేలా చూస్తే.. నిరుపేదలకు మేలు జరుగుతుంది. రెడ్‌క్రాస్ నుంచే ఎక్కువ యూనిట్ల రక్తం వస్తున్నందున దానికి చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ నిర్ణయం తీసుకుంటే జనరల్ ఆస్పత్రికి రక్తం కొరత నుంచి కొంత ఉపశమనం కలుగుతుంది.

నేడు రాష్ట్ర అవతరణ వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి జూపల్లి కృష్ణారావు
- ముస్తాబైన జిల్లా కార్యాలయాల సముదాయం



విద్యుత్ దీపాల వెలుతురులో ధగధగలాడుతున్న కలెక్టరేట్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ వేడుకలను సోమవారం జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో నిర్వహించనున్న ఉత్సవాలకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. వేడుకల సందర్భంగా కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంగు రంగుల కాగితాలతో తోరణాలను కట్టారు. ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలిపేందుకు స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

కార్యక్రమాలు ఇలా..

ఉదయం 9 గంటలకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుని, అక్కడ అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులు అర్పిస్తారు.

- 9:30 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకొని, జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. 9:35 గంటలకు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు.
- 9:40 గంటలకు సందేశాన్ని ఇస్తారు.
- 10 గంటలకు తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తారు.
- 10:20 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తారు.
- 11 గంటలకు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శిస్తారు.
- 12 గంటలకు కార్యక్రమాలు ముగుస్తాయి.

పరిశీలించిన కలెక్టర్

రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. కలెక్టరేట్‌లో ఏర్పాట్లను ఆదివారం ఆమె కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావు, ఏవో శంకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖాకీ కాఠిన్యం

- ప్రజలకు వడ్డీకి అప్పులు అందజేత
- తిరిగి చెల్లించని వారి నుంచి తక్కువ ధరకు భూములు లాక్కుంటున్న ఉద్యోగి
- వరుస ఫిర్యాదులతో కదిలిన ఉన్నతాధికారులు



మహబూబ్‌నగర్, జూన్1 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో అతనిదో చిన్న ర్యాంక్ ఉద్యోగం. అయితేనేం జిల్లా బాస్‌లు అనుభవించని లగ్జరీ జీవనం కొనసాగిస్తున్నాడు. అమాయకుల అవసరాలను ఆసరాగా చేసుకుని అప్పుగా డబ్బులివ్వడం, మిత్తి, అసలు కట్టలేని పరిస్థితుల్లో భూములు రాయించుకోవడం అతని స్టైల్. ఖాకీ మాటున ఉన్న కాఠిన్యం చూపుతూ.. పలువురి నుంచి పెద్ద ఎత్తున భూములను సొంతం చేసుకున్నాడు. అతనిపై అధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఎట్టకేలకు దర్యాప్తు మొదలుపెట్టారు.

పదేళ్లుగా ఇక్కడే..

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ హెడ్‌కానిస్టేబుల్ జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. పదేళ్లుగా అక్కడే పాతుకుపోయాడు. బదిలీ అయినా, రోజుల వ్యవధిలో మళ్లీ అక్కడే పోస్టింగ్ తెచ్చుకుని, తన దందా సాగిస్తుంటారు. ప్రజల అవసరాలకు వడ్డీకి డబ్బులు ఇస్తాడు. వారు డబ్బులు కట్టలేని పరిస్థితుల్లో ఒత్తిడి తెచ్చి, తక్కువ ధరకే భూమి రిజిస్ట్రేషన్ చేయించుకుంటాడన్న ఆరోపణలున్నాయి. ఇలా పలువురి నుంచి భూములు రాయించుకున్నట్లు తెలుస్తోంది. చివరకు రాజకీయ కారణాలు తోడవడంతో అతని భాగోతాలన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

స్పెషల్ బ్రాంచ్ పోలీసుల విచారణ

ఇతనిపై రాష్ట్ర, జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వస్తుండటంతో మొదట లైట్ తీసుకున్న అధికారి, ఫిర్యాదులు అలానే వస్తుండటంతో అతనిపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో నాలుగు రోజుల క్రితం విచారణకు ఆదేశించారు. వారు అన్ని కోణాల్లో విచారణ చేశారు. ఫిర్యాదు చేసిన బాధితులతోపాటు సాధారణ ప్రజల నుంచి వివరాలు సేకరించారు. ఎవరి దగ్గర ఎంత భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు?, ఎవరెవరి పేరిట ఆ భూములున్నాయి? వంటి వివరాలు సేకరించి, డీఐజీకి విచారణ నివేదికను శనివారం సమర్పించినట్లు తెలుస్తోంది. ఒకటి రెండో రోజుల్లో చర్యలు తీసుకునే అవకాశం ఉందన్న ప్రచారం సాగుతోంది. చర్యలు తీసుకుంటారా? లేక ఎప్పటిలానే సదరు ఉద్యోగి లాబీయింగ్ చేసి ఆపుకుంటారా అన్న చర్చ సాగుతోంది. నాలుగురోజులుగా ఇతనిపై సామాజిక మాధ్యమాలలో వార్తలు పెద్ద ఎత్తున చక్కర్లు కొడుతున్నాయి. కాగా సదరు ఉద్యోగి ముందునుంచే ఆర్థికంగా బలంగా ఉన్నారు. వారసత్వంగా వచ్చిన భూములు బాగానే ఉన్నాయి. దీంతో వడ్డీకి డబ్బులు ఇచ్చి భూములు రాయించుకుంటూ ఆస్తులను పెంచుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఫిట్‌లెస్

- ఫిట్‌నెస్ పరీక్షలకు ముందుకురాని ప్రైవేట్ స్కూల్ బస్సులు
- పాలమూరు జిల్లాలో ఇప్పటి వరకు చేయించినవి మూడోవంతే..
- నారాయణపేటలోనూ అదే పరిస్థితి
- ఫీజు, వార్షిక పన్ను చెల్లించాల్సి ఉండటంతో యాజమాన్యాల వెనుకడుగు
- గడువు ఈ నెల 12వ తేదీ

5



బడి బస్సు భద్రమేనా?.. అవి ఫిట్‌గా ఉంటున్నాయా?.. అందులో స్కూల్స్‌కు వెళ్లి వచ్చే విద్యార్థులు క్షేమమేనా? అంటే కాదనే సమాధానమే వస్తోంది. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని ప్రైవేట్ స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవడానికి ముందుకు రావడం లేదు. మహబూబ్‌నగర్ జిల్లాలో 473 బస్సులకు గాను కేవలం 175 బస్సులకే యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించగా, నారాయణపేట జిల్లాలో 152 బస్సులకు 42 బస్సులకే పరీక్షలు చేయించారు. ఫిట్‌నెస్ సమయంలో ఫీజుతో పాటు వార్షిక పన్ను చెల్లించాల్సి ఉండటంతో చాలా మంది పరీక్షలకు ముందుకు రావడం లేదన్న విమర్శలున్నాయి.

- మహబూబ్‌నగర్/నారాయణపేట

17 మంది పోలీసులకు సేవా పతకాలు

- ఒకరికి ఉత్తమ సేవా పథకం
- ఆగస్టు 15న అందజేత

మహబూబ్‌నగర్, జూన్1 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో పని చేస్తున్న పలువురు పోలీసులకు రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పురస్కారాలు లభించాయి. 17 మందికి సేవా పతకాలు, ఒకరికి ఉత్తమ సేవా పతకం వరించాయి. ఈ మేరకు ప్రభుత్వం పతకాలకు ఎంపికైన వారి జాబితాను విడుదల చేసింది. ఆగస్టు 15న వారికి మెడల్స్ అందించనున్నారు. జిల్లా పోలీసులు అధిక సంఖ్యలో పతకాలకు ఎంపిక కావడం పట్ల ఎస్పీ జానకి అభినందనలు తెలిపారు. భూత్పూర్‌లో పని చేస్తున్న ఏఎస్ఐ మహ్మద్ అశ్రఫ్ సుల్తాన్ ఉత్తమ సేవా పతకం కింద ఎంపిక అయ్యారు. సేవా పతకాల కింద కంట్రోల్ రూమ్ ఎస్ఐ ఎస్ బాల్‌రెడ్డి, డీఎస్‌బీ ఎస్ఐ బి సుజాత, మహిళా పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఎండీ ముస్తాక్, హన్వాడ ఏఎస్ఐ ఆర్ పద్మలత ఉన్నారు వారితో పాటు మిడ్జిల్ హెడ్‌కానిస్టేబుల్ జి యాదగిరి, దేవరకద్ర హెడ్ కానిస్టేబుల్ సి నర్సింహులు, మూసాపేట హెడ్ కానిస్టేబుల్ బి నాగిరెడ్డి, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ డి యాదయ్యగౌడ్, వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్ రాజేందర్‌రెడ్డి, టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ ఎండీ జహీరుద్దీన్, డీఎస్‌బీ హెడ్‌కానిస్టేబుళ్లు ఎం మధుబాబు, సత్యనారాయణగౌడ్, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ ఎండీ అల్తాఫ్ హుస్సేన్, వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ పి సురేశ్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ ఎం గోవర్దన్‌గౌడ్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజేందర్‌గౌడ్, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ ఈ గిరయ్య సేవా పతకాలకు ఎంపికయ్యారు.

ఆకట్టుకున్న మ్యాజిక్ షో

- మహబూబ్‌నగర్‌లోని మయూరి ఎకో పార్క్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు
- ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తాం: డీఎఫ్‌వో సత్యనారాయణ

4



సుభాష్ చంద్రబోస్ చౌరస్తా జంక్షన్‌లో ఏర్పాటు చేసిన నాలుగు సింహాల ప్రతిమ

జంక్షన్‌కు నయా లుక్

మహబూబ్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఎదురుగా సుభాష్‌బోస్ చౌరస్తా జంక్షన్‌లో నాలుగు సింహాల ప్రతిమ ఏర్పాటు చేయడంతో కూడలికి కొత్త అందం సంతరించుకుంది. ఈ కూడలిని విస్తరించి సుందరీకరణ పనులు చేపట్టారు. ఓ వైపు సుభాష్‌చంద్రబోస్, మరోవైపు గౌతమ బుద్ధుడి ప్రతిమను ఏర్పాటు చేయగా, ఆదివారం అభివృద్ధి చేసిన కూడలిపై నాలుగు సింహాల ప్రతిమను ఏర్పాటు చేయడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. వాటల్ ఫాల్స్‌ను కూడా ప్రారంభిస్తే ఈ జంక్షన్ ఫొటో షూట్‌గా మారుతుంది.

షార్ట్ సర్క్యూట్‌తో బొలెరో వాహనం దగ్ధం

నవాబ్‌పేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో బొలెరో వాహనం దగ్ధమైన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం పర్వతాపూర్ మైసమ్మ అడవిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కోస్గి మండలం ముశ్రిఫా గ్రామానికి చెందిన నరేష్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పర్వతాపూర్ మైసమ్మ ఆలయానికి మొక్కు తీర్చుకునేందుకు వెళ్తుండగా.. షార్ట్ సర్క్యూట్ బొలెరో వాహనంలో ఉన్న సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. దీంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. అప్రమత్తమైన నరేష్ అతడి కుటుంబ సభ్యులు బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. సంఘటన స్థలానికి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో మంటలను ఆర్పారు.

పెద్ద చెరువుకు చేరిన నీరు



మక్తల్ పెద్ద చెరువుకు చేరిన వర్షపు నీరు

మక్తల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని పెద్ద చెరువుకు నీరు రావడంతో జలకళ సంతరించుకుంది. పెద్ద చెరువు కింద సుమారుగా 600ఎకరాల ఆయకట్టు ఉంది. దీంతో మృగశిర కార్తెలో రైతులకు నారుమడులు చేసుకునేందుకు వర్షం తోడు కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పశువులకు తాగేందుకు నీరు పుష్కలంగా చేరడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు సమీపంలోని బోరు బావుల్లో నీటి మట్టం పెరిగే అవకాశం ఉందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు భారీ వర్షాలు కురిస్తే చెరువు అలుగుపారుతుందని రైతులు పేర్కొన్నారు. మేలో చెరువులో నీరు చేరడం ఇదే తొలిసారి అని పలువురు అభిప్రాయపడ్డారు. మృగశిరకార్తెకు ముందే విత్తనాలు నాటేందుకు సిద్ధమౌతున్నారు.

కేజీబీవీ పరిశీలన
అధికారి ఎవరు?

- ఖాళీగా మహబూబ్‌నగర్ జీసీడీవో పోస్టు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యా సంవత్సరం మరో పది రోజుల్లో ప్రారంభం కానుంది. జిల్లాలో మొత్తం 17 కేజీబీవీలు ఉండగా, అన్ని వసతులతో పాటు మెరుగైన విద్య అందుతుండటంతో విద్యార్థులు చేరేందుకు మక్కువ చూపుతున్నారు. దీంతో సీట్ల కోసం తీవ్ర పోటీ నెలకొంది. నిబంధనల ప్రకారం తల్లిదండ్రులు లేని విద్యార్థులు, ఆర్థికంగా వెనకబడిన, బడి మానేసిన బాలికలను కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునేందుకు అవకాశం ఉంటుంది. 2025-26 విద్యా సంవత్సరం ఈనెల 12 నుంచి ప్రారంభం కానుండగా, అందుకు సంబంధించి విద్యార్థులు కేజీబీవీలో చేరేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.



డీఈవో కార్యాలయం

కానీ జిల్లాలో కేజీబీవీలను పర్యవేక్షించే అధికారి ఎవరు లేరు? పాఠశాలలు సెలవులు ప్రకటించే నాటికి ఇన్‌చార్జి జీసీడీవోగా జిల్లా కేంద్రంలో ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు డిప్యుటేషన్‌పై కొనసాగింది. ఆ తర్వాత డిప్యుటేషన్ రద్దు చేస్తూ విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఈ పోస్టు కోసం పరీక్ష రాసి అర్హత ఉన్న ఓ ఉపాధ్యాయురాలుతో పాటు మరో ఇద్దరు ఉపాధ్యాయుల విద్యాశాఖ అధికారికి గత విద్యా సంవత్సరం చివరిలోనే దరఖాస్తు పెట్టుకున్నారు. కానీ ఇప్పటి వరకు జీసీడీవోగా ముగ్గురిలో ఎవరిని విధుల్లో తీసుకోకపోవడంతో జోరుగా పైరవీలు నడుస్తున్నట్లు విద్యాశాఖ శాఖలో చర్చ సాగుతోంది. మొత్తంగా పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి జీసీడీఈవోను నియమించాలని పలువురు కోరుతున్నారు.



మయూరి ఎకో పార్క్‌లో మ్యాజిక్ షో నిర్వహిస్తున్న మెజీషియన్



మ్యాజిక్ షోను తిలకిస్తున్న చిన్నారులు, సదర్శకులు

ఆకట్టుకున్న మ్యాజిక్ షో

- మహబూబ్‌నగర్‌లోని మయూరి ఎకో పార్క్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు
- ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తాం: డీఎఫ్‌వో

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ పట్టణంలోని మయూరి ఎకో పార్క్‌లో ఆదివారం అటవీశాఖ ఆధ్వర్యంలో నక్షత్ర ఈవెంట్ వారు నిర్వహించిన మ్యాజిక్ షో ఆకట్టుకుంది. పట్టణ ప్రజలు, చిన్నారులు షోను చూసి ఎంజాయ్ చేశారు. నక్షత్ర ఈవెంట్ సభ్యుడు ప్రవీణ్ పలు ప్రదర్శనలు ఇచ్చారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ గ్లోబల్ థీమ్‌పై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు డీఎఫ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఆసక్తి గల వారు 9700042022 నంబర్‌కు కాల్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. కలెక్టర్ విజయేందిర బోయి చేతుల మీదుగా విజేతలకు ఈనెల 5వ తేదీన బహుమతులు ఇస్తామని తెలిపారు.



అప్పన్నపల్లి అడవిలో పూజలు చేస్తున్న దృశ్యం

క్షుద్ర పూజల కలకలం

- అప్పన్నపల్లి అడవిలో ఘటన
- పూజలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

మహబూబ్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ సమీపంలోని అప్పన్నపల్లి అడవీ ప్రాంతంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి.. ప్రధాన రహదారి సమీపంలోనే అడవిలో ఓ పూజారి ఓ యువకుడిని కూర్చోబెట్టి ముందు నక్ష గీశాడు. నిండా పసుపు, కుంకుమ చల్లి, జీడి గింజలు, చుట్టూ నిమ్మకాయలు వేశారు. ఓ నాటుకోడిని తీసుకొచ్చి కూర్చున్న యువకుడి చుట్టూ తిప్పి పూజలు చేశాడు. పూజ చేస్తున్న విషయాన్ని గమనించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అక్కడి పరిస్థితిని పరిశీలించారు. అప్పన్నపల్లికి చెందిన పవన్‌కుమార్ అలియాస్ పాండు ప్రైవేట్ స్కూల్ బస్సు నడి పిస్తాడు. అతని కొడుకు గణేష్‌ను అక్కడ కూర్చోబెట్టి ఎదిరకు చెందిన పూజారి పెంటోజీ పూజలు చేశారు. అయితే క్షుద్ర పూజలు చేస్తున్నాడని ప్రచారం జరగగా, బాధితుడు పాండు మాత్రం తన కొడుకు గణేష్ ఆరోగ్యం బాగాలేనందున పెంటోజీని ఆశ్రయిస్తే తను పూజ చేసి ఆరోగ్యాన్ని నయం చేస్తానని చెప్పడంతో ఆదివారం అడవిలో పూజా కార్యక్రమం నిర్వహించామని చెబుతున్నాడు. దీంతో పెంటోజీపై చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో మాత్రం క్షుద్ర పూజలపై రకరకాల ప్రచారం సాగుతోంది. ఇంతకీ ఎవరిపై క్షుద్ర పూజలు చేస్తున్నారన్న చర్చ సాగుతోంది.

సోమశిలకు చేరిన వరద జలాలు

- రోజుకు రెండు అడుగుల మేర పెరుగుతున్న నీటి మట్టం
- కృష్ణానదిలో పది అడుగుల నీరు చేరితే సంగమేశ్వరం గర్భాలయంలోకి వరద జలాలు



కృష్ణానదిలో సంగమేశ్వరం ఆలయ సమీపంలోకి చేరిన వరద జలాలు

కొల్లాపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : జూరాల ప్రాజెక్టు నుంచి విడుదలైన వరద జలాలు సోమశిల కృష్ణానదికి చేరాయి. ప్రతీ రోజు రెండు అడుగుల మేర నీటి మట్టం పెరుగుతూ వస్తున్నది. గత ఏడాది కన్నా ఈ ఏడాది నెల రోజులు ముందే కృష్ణానదికి జలకళ సంతరించుకుంది. వరద నీరు ప్రవహిస్తున్నందున మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు కృష్ణానదిలోకి వెళ్లొద్దని రెవెన్యూ, పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు. మరో 10 అడుగుల మేర కృష్ణానదిలో నీరు చేరితే తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆరాధ్య దైవంగా పూజించే సప్త నదుల సంగమక్షేత్రం గర్భాలయంలోకి నీరు చేరుతుందని ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామయ్య శర్మ పేర్కొంటున్నారు. సోమశిలలో పెరుగుతున్న వరద జలాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున కృష్ణానదిని సందర్శిస్తున్నారు. ప్రస్తుతం కృష్ణానదిలో భీమా నది వరద జలాలు కొనసాగుతూ ఉన్నాయి. జూరాల ప్రాజెక్టు నుంచి శ్రీశైలం జలాశయానికి నీళ్లు వదులుతున్న విషయం తెలిసిందే.

వెల్ఫేర్ బోర్డు నిధులు కార్మికుల
సంక్షేమానికి కేటాయించాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకరం కోటంరాజు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దారి మళ్లించిన వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకరం కోటంరాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రూబి గార్డెన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా రెండో మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలో మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాసిందన్నారు. కార్మిక వెల్ఫేర్ బోర్డు నిధులను వారి కోసం ఖర్చు చేయకుండా ప్రభుత్వం ఇతర స్కీంలకు మళ్లించదని ఆరోపించారు. దేశానికి సంపదను సృష్టిస్తున్న కార్మికులను శ్రమను కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్‌కు దోచిపెడుతుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై జూలై 9న నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు రాముడు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు గట్టు శ్రీను, కోశాధికారి శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, నాయకులు బాలస్వామి, వెంకటయ్య, కృష్ణయ్య, ఆంజనేయులు, వెంకటస్వామి పాల్గొన్నారు.

చిన్నోనిపల్లి రిజర్వాయర్ పై కుట్ర !

- గుట్టు చప్పుడు కాకుండా ఏర్పాటు చేస్తున్న కాలువ
- రిజర్వాయర్‌లో నీరు నిల్వ లేకుండా ఉండేందుకు ప్లాన్ !
- అధికార పార్టీ నాయకుడి కనుసన్నల్లో పనులు ?

గద్వాల, జూన్ 01 (ఆంధ్రజ్యోతి) : రిజర్వాయర్ ఉందంటే ఆ ప్రాంత రైతాంగానికి అదొక వరం. అటువంటి రిజర్వాయర్ మీదనే నాయకులు స్వార్థపు ఆలోచనలు చేసి నిల్వ నీటిని కొల్లగొట్టేందుకు పూనుకుంటే రైతులను ఎవరు కాపాడాలనే చర్చ గద్వాల జిల్లాలో మొదలైంది. గద్వాల నియోజకవర్గంలోని గట్టు మండలం, చిన్నోనిపల్లి వద్ద 1.5 టీఎంసీల సాగునీటి సామర్థ్యంతో ప్రభుత్వం నిర్మించిన రిజార్వాయర్‌పై కుట్ర జరగటం ఆందోళన కలిగించే అంశం. గతేడాది రిజర్వార్‌లో పూర్తిస్థాయి నీరు నింపే ప్రయత్నం చేశారు. ముంపు గ్రామమైన చిన్నోనిపల్లి ప్రజలందరిని ఖాళీ చేయించి మరో చోట ప్రభుత్వం పునరావాసం కల్పించింది. ఇదంతా బాగానే ఉన్నా తాజాగా అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి అనాలోచిత నిర్ణయంతో రిజర్వాయర్‌లో నీరు నిల్వ లేకుండా కొల్లగొట్టేందుకు కుట్రపన్నడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావటం, అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరనే ఉద్దేశంతో ఆ నాయకుడు ఏకంగా రిజర్వాయర్ కట్ట వెంబడి ఎక్స్‌కవేటర్‌తో కాలువ తవ్వి మోరీలు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు. అసలు ఈ కాలువ తవ్వి మోరీల ద్వారా రిజర్వాయర్‌లో ఉన్న సాగునీటిని వృథాగా తుంగభద్రనదిలోకి పంపే కుట్రకు ఎందుకు తెరలేపారో అర్థం కాక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

చిన్నోనిపల్లి రిజర్వాయర్ ద్వారా 15 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. కానీ అధికారిక లెక్కల ప్రకారం ఈ రిజర్వాయర్ కింద 6 వేల ఎకరాలు మాత్రమే సాగు విస్తీర్ణం ఉంది. అయినప్పటికీ ఇక్కడ రిజర్వాయర్‌లో ఏడాది పొడవున సాగునీరు నిల్వ ఉండటం వల్ల గట్టు మండలంలోని చిన్నోనిపల్లి, బోయలగూడెం, లింగాపురం గ్రామాల, అయిజ మండలంలోని టీటీదొడ్డి, భూంపురం, ముగోనిపల్లి, ఈడిగోనిపల్లి, సంకాపురం గ్రామాల రైతులకు సంబంధించిన బోరుబావుల్లో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటున్నాయి. వీటి ద్వారా ఆయా గ్రామాలలో ఉన్నటువంటి రైతులు రెండు పంటలను సాగుచేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు.



చిన్నోనిపల్లి రిజర్వాయర్ వద్ద తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కవేటర్

గ్రామస్థులు పైపుల ఏర్పాటు చేసుకుంటున్నారు



గత ఏడాది రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీటిని నింపే ప్రయత్నం చేశాం. గ్రామంలోకి నీళ్లు రావడంతో కలెక్టర్ ఆదేశం మేరకు తూము నిర్మాణం చేయలేదు. ఆ లెవల్‌లో నీళ్లు ఉండటంతో బోయలగూడెంతో పాటు ఇతర గ్రామాలకు రోడ్డు మార్గం ఇబ్బంది అయ్యింది. ఇప్పుడు ఆ గ్రామాల ప్రజలు సొంతంగా పైపులు వేసి వెళ్లడానికి చేసుకుంటున్నారని తెలిసింది. పూర్తిగా వివరాలు సేకరిస్తాం. తూము నిర్మించి రిజర్వాయర్‌ను పూర్తింగా నింపుతాము.

- రహిముద్దీన్, ఎస్‌ఈ, గద్వాల

కానీ ప్రస్తుతం జరుగుతున్న అనాలోచిత నిర్ణయంతో రిజర్వాయర్‌లోని సాగునీరు నిల్వలేకుంటే రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని వారు ఆగ్రహిస్తున్నారు.

ప్రశ్నార్థంగా లింక్ కెనాల్ ఏర్పాటు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సమయం నుంచి చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి ఆర్‌డీఎస్ కాలువకు లింకు కెనాల్ ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని అయిజ మండల ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రిజర్వాయర్ కింద ఉన్న సాగు విస్తీర్ణం 6 వేల ఎకరాలే కాబట్టి మరో 9 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఈ రిజర్వాయర్ ద్వారా ఉండనుంది. ఎనిమిదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం కూడా లింకు కెనాల్ ఏర్పాటు ప్రతిపాదన కోసం సర్వే చేశారు. 7.5 కిలోమీటర్ల దూరంలో ఆర్‌డీఎస్ వరకు లింక్ కెనాల్ ఏర్పాటు చేసి అయిజ మండల ప్రజలకు సాగునీరు అందించేందుకు రూ.38 కోట్లు అవసరం ఉన్నట్లుగా ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా అయిజ మండల ప్రజలు ప్రధానంగా కోరుకున్న డిమాండ్ కూడా ఇదే. అన్ని పార్టీల నాయకులు కూడా లింక్ కెనాల్ ఏర్పాటుకు మద్దతు ప్రకటించారు. తాజాగా ఏర్పాటు చేస్తున్న కాలువ ద్వారా లింక్ కెనాల్ ఏర్పాటు అంశం ప్రశ్నార్థకంగా మారింది.

అటవీ భూములు దున్నితే చర్యలు

- హెచ్చరించిన అటవీశాఖ అధికారులు
- భూములు దున్నుతున్న మూడు ట్రాక్టర్లు సీజ్

కొల్లాపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అటవీ భూములు దున్నితే అటవీశాఖ ఆధ్వర్యంలో చర్యలు తప్పవని అటవీ అధికారులు హెచ్చరించారు. ఆదివారం కొల్లాపూర్ మండలంలోని నల్లమల గ్రామాలలో స్పెషల్ టీం స్ట్రైక్ ఫోర్స్ అధికారి మగ్దూం, కొల్లాపూర్ అటవీశాఖ రేంజర్ చంద్రశేఖర్, కొల్లాపూర్ రేంజ్ స్టాఫ్ అందరూ కలిసి అటవీ ప్రాంతం చుట్టు పక్కల పరిసరాల్లో అటవీ భూమిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామస్థులను హెచ్చరించారు. అటవీ ప్రాంతంలో అటవీ హక్కు పత్రాలు ఉన్న వారు, లేని వారు అక్రమంగా అడవిలో చెట్లు నరికినా, భూమిని చదును చేసినా అలాంటి వారిపై అటవీ చట్టం 1967 ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆదివారం ముక్కిడిగుండం, చంద్రబండతండా గ్రామాలలో అక్రమంగా అడవిలో దున్నుతున్న 3 ట్రాక్టర్‌లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. 3 ట్రాక్టర్లను అచ్చంపేట అటవీ డిపోకు తరలించినట్లు తెలిపారు. కొల్లాపూర్ నల్లమల రేంజ్ పరిధిలో ఎలాంటి అక్రమాలు జరగకుండా నిఘా పెట్టినట్లు, స్పెషల్ టీంలను ఏర్పాటు చేసినట్లు రేంజర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ డిప్యూటీ రేంజర్ ముజీబ్ ఘోరి, కాశన్న శివ, నీలేష్, జయరాజ్, బయన్న, మల్లేష్, బీట్ అధికారులు వాల్యా నాయక్, నాగార్జున గౌడ్, నవీన్, కిరణ్, శ్యామ్, లిఖిత, రామాంజనేయ గౌడ్, మహేష్, లక్ష్మణ్, అటవీ సిబ్బంది, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.



అటవీ ప్రాంతంలో భూములు దున్నిన ట్రాక్టర్లను సీజ్ చేసిన అటవీ అధికారులు

పేదలకు చదువును దూరం చేసేందుకే...
ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ

- డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కారదర్శులు, గోవర్ధన్

అచ్చంపేట టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పేద బిడ్డలకు చదువును దూరం చేసేందుకే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అని, వెంటనే ప్రభుత్వం సర్దుబాటు ప్రక్రియను విరమించుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, గోవర్ధన్, జక్క రామస్వామి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ వేసవికాలమంతా ఉపాధ్యాయులకు, అధికారులకు ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ఎంతో హడావుడి చేస్తూ మే మాసం మొత్తం ట్రైనింగ్‌ల పేరుతో కాలయాపన చేసిందన్నారు. ప్రభుత్వానికి నిజంగా పేదవర్గాల బిడ్డలకు నైపుణ్యమైన విద్యను అందించాలనే తపన ఉంటే ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి కాకుండా ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయున్ని, తరగతికి ఒక గదిని నిర్మించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖడిస్తున్నామని తక్షణమే ఉపసహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలి

- నిరాహార దీక్ష చేపట్టిన మేఘరాజు



పెంట్లవెల్లిలో నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త మూలే మేఘరాజు

పెంట్లవెల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండును వినియోగంలోకి తేవాలని ఆదివారం సామాజిక కార్యకర్త మూలే మేఘరాజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండు వినియోగంలోకి తేవాలని గతంలో ఎన్నోసార్లు ఆర్టీసీ డీఎంకి ఫిర్యాదు చేశామని, పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్‌లోకి 25 సంవత్సరాల నుంచి ఒక బస్సు కూడా లోపలికి రావడం లేదని పేర్కొన్నారు. వినియోగంలో లేకపోవడంతో చెత్తాచెదారం, మురుగునీరు, బస్టాండ్‌లోకి వస్తున్నదన్నారు. బస్టాండ్ వినియోగంలోకి తెచ్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. నిరాహార దీక్ష చేపట్టిన మూలే మేఘరాజుకు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోవురాజు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన కొల్లాపూర్ తైక్వాండో కింగ్స్ క్లబ్ విద్యార్థులు

కొల్లాపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ఘట్‌కేసర్‌లో ఈ నెల 31, జూన్ 1వ తేదీన నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో కొల్లాపూర్ తైక్వాండో కింగ్స్ క్లబ్‌కు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని కోచ్ చెనమోని భాస్కర్ యాదవ్ ఆదివారం తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు జూన్ 23, 24, 25 తేదీలలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో నిర్వహించే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొననున్నారని పేర్కొన్నారు. అండర్ 16, 18, 23, 32, 74 వెయిట్ కేటగిరి విభాగంలో రమ్య గోల్డ్ మెడల్, పాండు సిల్వర్ మెడల్, అజిత్, విజయ్, ఆదిత్య యాదవ్, రోహిత్, పాండ్య, బ్రాంచ్ మెడల్‌లు సాధించారని తెలిపారు.

తేజాన్ష్, హరీశ్, ఆదిత్యా యాదవ్, నక్షత్ర, నాగరాజు, విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను మాస్టర్ శరబంధరాజు, నాగర్‌కర్నూల్ జిల్లా సెక్రటరీ శేఖర్, తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీహరి మాస్టర్ కోచ్‌లు శివ కుమార్ యాదవ్, ఉపేందర్, మల్లేష్ యాదవ్, రవీందర్, తల్లిదండ్రులు అభినందించారు.

క్రైం కార్నర్

కుక్క కాటుతో పలువురికి గాయాలు



కుక్క కాటుతో వృద్ధురాలి చేయిపై అయిన గాయం

అలంపూరు జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండల పరిధిలోని ర్యాలంపాడు గ్రామంలో పలువురు గ్రామస్థులు కుక్క కాటుకు గురైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఒక వృద్ధురాలు ఇంటి బయట నిద్రిస్తుండగా కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలవడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే గ్రామంలోని పలువురికి పిచ్చి కుక్క దాడి చేయడంతో ఈ విషయమై సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద లేకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కారు బోల్తా - కాంగ్రెస్ నాయకుడికి తీవ్ర గాయాలు



సంజీవపూర్ బస్‌స్టేజీ వద్ద బోల్తా పడిన కారు

పెద్దకొత్తపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కాంగ్రెస్ నాయకుడు గంట్రావుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పగడాల చిన్నయ్య ప్రయాణిస్తున్న కారు ఆదివారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్నయ్య తీవ్ర గాయపడ్డాడు. మండల పరిధిలోని గంట్రావుపల్లి గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పగడాల చిన్నయ్య తన కారులో ఆదివారం నాగర్‌కర్నూల్ వైపు ప్రయాణిస్తున్నాడు. సంజీవాపూర్ బస్ స్టేజీ సమీపంలో అదుపు తప్పిన కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతిన్నది. చిన్నయ్య తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్‌లో గాయత్రి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు.

అయితే ఆదివారం సాయంత్రం సంఘటన స్థలాన్ని జూపల్లి అరుణ్ పరిశీలించి, ప్రమాదం జరగడానికి గల పరిస్థితులను ఆయన పార్టీ నాయకులతో కలిసి తెలుసుకున్నారు. అనంతరం గాయత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నయ్యను పరామర్శించారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

మద్దూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘనట నారాయణపేట జిల్లా మద్దూర్ శివారులో ఆదివారం చోటు చేసుకొంది. మద్దూర్ ఎస్ఐ విజయ్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం.. మద్దూర్ మునిసిపాలిటీ పరిధిలోని నాగంపల్లి గ్రామానికి చెందిన జోగు లవకుమార్(25) గ్రామం నుంచి మద్దూర్‌కు వస్తుండగా మద్దూర్ నుంచి రావులపల్లి వైపు వెళ్తున్న లారీ మద్దూర్ శివారులోని హెచ్‌పీ గ్యాస్ గోదాం సమీపంలో ఢీకొనడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెం దాడు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ మృ తుని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. సమాచా రం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి గ్రామస్థులను సముదాయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ఆసుపత్రికి తరలించారు. మృతుని తల్లి అనంతమ్మ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ ఆదిల్ బాషాపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

ఎర్రవల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహిళ పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలో గత నెల 30వ తేదీన శంకరమ్మ (45) భర్తతో గొడవపడి ఇంట్లో ఉన్న ఎలుకల మందును తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న శంకరమ్మ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. కుమారుడు చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

● ఇటిక్యాల మండల పరిధిలోని పెద్దదిన్నె గ్రామంలో గొల్ల నారాయణ(71) అనారోగ్య సమస్యతో పురుగుల మందు తాగగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. గత నాలుగు సంవత్సరాల క్రితం భార్య లక్ష్మీదేవి చనిపోవడంతో ఒంటరి జీవితాన్ని మానసికంగా భరించలేకపోయాడు. ఈయన కాళ్లనొప్పులతో బాధపడుతుండేవాడు. గత నెల 27వ తేదీన కల్లందొడ్డిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించాడు. గమనించిన పొరుగువారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక శనివారం మృతి చెందాడు. ఈ సంఘటనపై కుమారుడు గొల్ల బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కుటుంబ కలహాలు భరించలేక..

మూసాపేట(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలు తాళలేక మనస్తాపనికి గురై వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని మహ్మద్‌హుస్సేన్‌పల్లిలో చోటుచేసుకుంది. మూసాపేట ఎస్సై ముల్కలపల్లి వేణు కథనం ప్రకారం.. మహ్మద్‌హుస్సేన్‌పల్లిలో కంతి కాశన్న(55) అనే వ్యక్తికి ఇంట్లో తన భార్యతో తరచుగా కుటుంబ కలహాలు జరుగుతుండేవి. దీంతో మనస్తాపనికి గురైన అతడు శనివారం అందరూ తిని పడుకున్న తర్వాత మధ్యరాత్రి లేచి బాత్రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం అతని కుమారుడు మహేష్ లేచి చూడగా బాత్రూమ్‌లో ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఫిట్‌లెస్!



- పరీక్షలకు ముందుకురాని ప్రైవేట్ స్కూల్ బస్సులు
- చివరి క్షణం వరకు జాప్యం చేసి పరీక్షలు చేయించకుండా రోడ్లపైకి..
- నామమాత్రపు తనిఖీలు.. ప్రైవేట్ యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గుతున్న అధికారులు
- పాలమూరు జిల్లాలో 473 బస్సులకు కేవలం 175 బస్సులకే ఫిట్‌నెస్ పరీక్షలు
- పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి వంద శాతం చేసుకోవాలి
- ప్రైవేట్ స్కూల్ బస్సు ప్రయాణం భయం.. భయం



స్కూల్ బస్

పేట జిల్లాల్లో 142 ప్రైవేట్ పాఠశాలలు

జిల్లా వ్యాప్తంగా 142 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, 37,968 విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 152 బస్సులు ఉన్నాయి. ఇప్పటివరకు ఫిట్‌నెస్ పరీక్షలు 40 బస్సులకు చేశారు. ఇంకా 112 బస్సులకు పరీక్షలు చేయాల్సి ఉన్నది. జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని రవాణా శాఖ అధికారులు సూచించారు. ప్రతీ సంవత్సరం మే 15న బస్సు సామర్థ్యం పరీక్షల గడువు తీరుతుంది. ఆ తర్వాత నుంచి యాజమాన్యం విధిగా రవాణా శాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. ఆ తర్వాతనే రోడ్డుపై తిప్పాలి. అదేమి చేయకుండా రోడ్డుపై తిపుతే ఏదైనా ప్రమాదం జరిగితే బీమా వర్తించదు.

మహబూబ్‌నగర్/నారాయణపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు అంటే అందులో 50 మంది విద్యార్థులు.. ఆ చిన్నారుల భవిష్యత్తు ఆ బస్సు.. బస్సును నడిపే డ్రైవర్‌పై ఆధారపడి ఉంటుంది. బస్సు ఫిట్‌నెస్ లేకున్నా.. డ్రైవర్ కండీషన్‌లో లేకున్నా జరగరాని నష్టం జరిగిపోతుంది.. అందుకే ప్రతీ ఏటా ప్రైవేట్ స్కూల్ బస్సులకు రవాణా శాఖ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తుంది. డ్రైవర్ల కండిషన్‌ను కూడా పరిశీలిస్తుంది. పరీక్షకు వచ్చిందంటే నిబంధనల ప్రకారం ఫిట్‌నెస్‌తో పాటు బస్సులో తీసుకోవాల్సిన భద్రత చర్యలు, విద్యార్థులకు కావలసిన అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయా? లేదా అని క్షుణ్ణంగా పరిశీలించి సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఫిట్‌నెస్ పరీక్ష అయిందంటే ఎంవీ చట్టం నిబంధనల ప్రకారం ఆ బస్సు రోడ్డుపైకి రావడానికి కావలసిన అన్ని అర్హతలు ఉన్నట్లే లెక్క.



మహబూబ్‌నగర్‌లో ప్రైవేట్ స్కూల్ బస్సు ఫిట్‌నెస్ పరీక్షలను పరిశీలిస్తున్న రవాణా శాఖ అధికారులు(ఫైల్)

పాలమూరు జిల్లాలో 472 ప్రైవేట్ స్కూల్ బస్సులు ఉన్నాయి. వీటికి ప్రతీ ఏటా మే 15 వరకు ఫిట్‌నెస్ గడువు ఉంటుంది. ఆ తరువాత మళ్లీ ఏడాది కాలానికి రవాణా శాఖ కార్యాలయానికి బస్సును తీసుకెళ్లి మరో ఏడాది కాలానికి ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకోవాలి. మే 15నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి అంటే జూన్ 12 వరకు పరీక్షలు చేయించుకుని ఆ తరువాత విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్లేందుకు రోడ్లపైకి రావాలి. పరీక్షలు చేయించుకోకుండా బస్సు రోడ్డెక్కడానికి వీలులేదు.

● ఇప్పటివరకు మూడో వంతే

ఫిట్‌నెస్ పరీక్షలు ప్రారంభం అయి 15 రోజులు గడిచిపోయింది. ఇప్పటివరకు జిల్లాలో 473 బస్సులకు గాను కేవలం 175 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు జరిగాయి. 36 శాతం మాతమే పరీక్షలు జరిగాయి. ఇంకా ఫిట్‌నెస్ చేసుకోవాల్సిన బస్సులు 298 వరకు ఉన్నాయి. ఫిట్‌నెస్‌కు బస్సు వచ్చిన సమయంలో ఫీజు రూ.1100లతో పాటు రూ.15 వేల వరకు వార్షిక పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీంతో చాలామంది పరీక్షలకు వెనకడుగు వేస్తున్నారన్న విమర్శలున్నాయి.

చాలామంది చివరి వరకు జాప్యం చేసి ఆ తరువాత అధికారులను మేనేజ్ చే సుకుని పరీక్షలు చేయించుకోకుండానే రోడ్డెక్కుతున్నాయన్న ఆరోపణలున్నాయి. పాఠశాలలు ప్రారం భం అయిన తరువాత అధికారులు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను వేసి వారం, పది రోజులు తనిఖీలు చేసి వదిలేస్తున్నారు. దీంతో 25-30 శాతం బస్సులు ప్రతీ ఏటా పరీక్షలు చేయించుకోకుండానే రోడ్లపైకి వచ్చేస్తున్నాయి.

ప్రైవేట్ పాఠశాలల ఒత్తిడికి తలొగ్గి అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. రవాణా శాఖ అధికారులు ప్రతీసారి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. డ్రైవర్ల కండీషన్, వయస్సుపైనా అవగాహన కల్పిస్తున్నారు. డ్రైవర్ల వయస్సు 60 దాటవద్దని, వారికి ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండకూడదని, ప్రతీ ఆరు నెలలకోసారి వైద్యపరీక్షలు నిర్వహించాలని చెబుతున్నా కొందరు వీటిని బేఖాతరు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. రవాణా శాఖ అధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు మక్సూద్ బిన్ జాకీర్
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్‌లో జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు మక్సూద్ బిన్ జాకీర్ అన్నారు. త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి 3X3 బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా మహిళలు, పురుషుల జట్ల ఎంపికలను ఆదివారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవ్వాలని ఆకాక్షించారు. జిల్లా బాస్కెట్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని, ప్రతిభ గల క్రీడాకారులకు అండగా ఉంటామని తెలిపారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు మీర్ ఖాలెద్‌అలీ, ఇలియాజ్, ముకరం, సుభాన్‌జీ తదితరులు పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టుతో అధ్యక్షుడు మక్సూద్ బిన్ జాకీర్ తదితరులు


ఉమ్మడి జిల్లా బాస్కెట్ టీమ్ ఇలా..

పురుషుల జట్టు...
అబ్దుల్ బాసిత్, రోహిత్, వివేక్, ఎస్.ఆదిత్యనారాయణ్

మహిళ జట్టు...
భువనేశ్వరి, అరచిత, ప్రియాంక, తనుశ్రీ

కొనసాగుతోన్న వరద

- డ్యాంలోకి చేరిన 27 వేల క్యూసెక్కులకు పైగా నీరు



శ్రీశైలం ప్రాజెక్టులో బ్యాక్ వాటర్

దోమలపెంట/ధరూరు/అమరచింత, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పరివాహక ప్రాంతం నుంచి వరద నీటి రాక కాస్త తగ్గినప్పటికీ ఎగువన ఉన్న సుంకేసుల నుంచి 2,231 క్యూసెక్కులు, జూరాల ప్రాజెక్టు నుంచి గత మూడు రోజులుగా దిగువకు విడుదల చేసిన వరద నీరు నేటికి శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతున్నది. మొత్తంగా 27,203 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరింది. ఎంజీకేఎల్ఐ కాల్వకు నీటిని తరలింపు నిలిపివేశారు. దీంతో ఆదివారం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగుల కు గాను, 831.10 అడుగులకు చేరగా, 215.807 టీఎంసీల సామర్థ్యానికి గాను 50.6888 టీఎంసీల నీటి నిల్వలు నమోదు అవుతున్నట్లు డ్యాం గేజింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రా లలో ఉత్పత్తి కొనసాగించడం లేదు.



సమాంతర కాలువ ఇంటేక్‌వెల్ హెడ్ రెగ్యులేటర్ వద్దకు చేరిన వరద నీరు

జూరాలకు తగ్గిన వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టడంతో జెన్‌కో జలవి ద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి నిలిపి వేశారు. ఆల్మట్టి జలాశయంలో 52.42 టీఎంసీలకు నీటి నిల్వ చేరుకోగా, దిగువన ఉన్న నారాయణపూర్ జలాశయంలో 25.39 టీఎంసీలకు నీటి నిల్వ చేరకుంది. ప్రస్తుతం జూరాల జలాయశంలో 317.560 మీటర్లలో నీటి నిల్వ ఉండగా ప్రాజెక్టులో 4.052 టీఎంసీలకు నీటి నిల్వ చేరుకుంది. ప్రాజెక్టులో 14 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, జెన్‌కో జలవిద్యుత్ కేంద్రానికి నీటి విడుదలను నిలిపి వేయడంతో విద్యుత్ ఉత్పత్తి నిలిచి పోయింది. దీంతో నెట్టెంపాడు లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు, కుడి కాల్వకు సైతం నీటి విడు దలను నిలిపి వేశారు. జూరాల ప్రాజెక్టు నుంచి 834 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జూరాల అధికారులు తెలిపారు.

● ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఆదివారం స్వల్పంగా ఇన్‌ఫ్లో నమోదయింది. కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతున్నది.

సందర్శకుల సందడి



చేపలు కొనడానికి పోటీ పడుతున్న పర్యాటకులు

అమరచింత, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద ఆదివారం సందర్శకులు పోటెత్తారు. ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీ వరద నీరు వచ్చి చేరడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ప్రాజెక్టు సోయగాలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం కావడం కార్యాలయాలకు సెలవులు ఉండటంతో ప్రత్యేక వాహనాల్లో ప్రాజెక్టుకు చేరుకొని అక్కడ అందాలను ఆస్వాదించారు. ప్రధాన ఎడమ కాలువ సమీపంలో చేపల కూర తినడానికి పర్యాటకులు పోటీ పడ్డారు. నోరూరించే చేపల కూర తింటూ పర్యాటకులు సందడి చేశారు.

ప్రధాన కాలువ ప్రాంతంలో చేపల ఫ్రై దుకాణాల వద్ద భారీగా నిలిచిన వాహనాలు



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారిణులతో మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, పక్కన ఎండీసీఏ సెక్రటరీ ఎం.రాజశేఖర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో ఉమ్మడి జిల్లా మహిళల జట్ల ఎంపికలను మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మహిళ క్రికెటర్లు రంజీ, జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. తెలంగాణకు చెందిన మహిళా క్రికెటర్ గొంగడి త్రిష అంతర్జాతీయ టోర్నీలో ప్రతిభ చాటిందని గుర్తుచేశారు. ప్రతీ క్రీడా అంశాల్లో మహిళలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు, క్రీడాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి 60 మంది పాల్గొన్నారని తెలిపారు. మూడు జట్లను ఎంపిక చేసి, ఈ నెల 9,10 తేదీల్లో ఉమ్మడి జిల్లా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, వెంకటరామారావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారులు మన్నాన్, అబిద్ పాల్గొన్నారు.

అండర్-23 జట్టు ప్రాబబుల్స్ ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టుకు ప్రాబబుల్స్ ప్రతిభ కనబరిచిన 27 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు పోటీలు నిర్వహించి, రాణించిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు.

అండర్-23 జట్టు ప్రాబబుల్స్...

షాదాబ్‌అహ్మద్, అబ్దుల్ రఫె, కె, శ్రీకాంత్, అక్షయ్, శాశంక్, ముఖీద్, అభిలాష్(మహబూబ్‌నగర్), చత్రపతి, రాహుల్, మణి, జయసింహ(గద్వాల), క్యాతేశ్వర్, చరణ్, రామ్‌చరణ్, జశ్వంత్, గగన్, రాఖీ, చైతన్య(నాగర్‌కర్నూల్), ప్రతీష్, అర్యన్(నారాయణపేట), మహేష్‌నాయక్(వనపర్తి), సంజయ్, కేతన్, అక్షయ్, మణిచరణ్, హర్షిత(జడ్చర్ల).

గొర్రెల చోరీకి యత్నం

మూసాపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం కందూరు గ్రామ శివారులోని గౌరిదేవునిపల్లి వద్ద గొర్రెల మందల దగ్గర చోరీకి యత్నించిన అమనుమానిత వ్యక్తులను కాపరులు పట్టుకున్న సంఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళ్లగా.. కందూరు గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు నక్క రాములు, పెద్దఆశన్న, అంజన్న తమ గొర్రెలను గ్రామ శివారులోని గౌరిదేవునిపల్లి సమీపంలో మందలో ఆపుకున్నారు. అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు మొబైల్ లైట్లు వేసుకుని మంద దగ్గర అనుమానాస్పదంగా కన్పించడంతో అప్రమత్తమైన కాపరులు గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు.

దీంతో వారిని గ్రామస్థులు, కాపరులు చుట్టుముట్టి పట్టుకున్నారు. వారిని ఇష్టానుసారంగా చితకబాది నిలదీయగా ఖిల్లాఘనపూర్ మండలం మామిడిమాడకు చెందిన శ్రీకాంత్, కృష్ణ, మధు అని తెలిపారు. దీంతో ఈ ముగ్గురిని పోలీసులకు అప్పగించారు. వారిని సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామన్నారు.

న్యూస్ బాక్స్

రేపటి నుంచి భూ భారతి గ్రామ సభలు

గండీడ్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 3వ తేదీ నుంచి 16వ తేదీ వరకు భూ భారతి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు గండీడ్ తహసీల్దార్ మల్లికార్జున్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న రెడ్డిపల్లి, కాప్లాపూర్, 4న బల్సూర్‌గొండ, గోవిందుపల్లి, 5న కొండాపూర్, సాలర్‌నగర్, 6న వెన్నాచేడ్, సల్కర్‌పేట్, 9న పగిడ్యాల్, వరహగిరి పల్లి, 10న మన్సూర్‌పల్లి, రుసుంపల్లి, 11న గండీడ్, చెలిమిళ్ల, 12న కొంరెడ్డిపల్లి, జైస్‌పల్లి, 13న పెద్దవార్వల్, జిన్నారం, 16న చిన్నవార్వల్ గ్రామాల్లో భూభారతి సభలు కొనసాగుతాయని, ఆయా గ్రామాల రైతులు సహకరించాలని కోరారు.

● దేవరకద్ర : రేపటి నుంచి 18వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 చట్టం భూ భారతిలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో రైతుల భూ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

● మూసాపేట : అడ్డాకుల మండలంలో రేపటిన నుంచి 20వ తేదీ వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న శాఖాపూర్, 4న కందూరు, 5న కాటవరం, 6న అడ్డాకుల, 9న తిమ్మాయిపల్లి, 10న రాచాల, 11న పొన్నకల్, 12న ముత్యాలంపల్లి, 13న వర్నె, 16న కన్మనూర్, 17న బలీద్‌పల్లి, 18న పెద్దమునగాల్‌చెడ్, 19న చిన్నమునగాల్‌చెడ్, 20న గుడిబండలో సదస్సులు ఏర్పాటు చేశామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఉద్యమకారులను విస్మరించడం తగదు'

జడ్చర్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అవతరణ వేడుకల్లో ఉద్యమకారులను విస్మరించడం ఎంతవరకు సమంజసమని తెలంగాణ ఉద్యమ కారుల ప్రతినిధి దానం హరిబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆవిర్భావ వేడుకలకు ఉద్యమకారులను ఆహ్వానించక పోవడాన్ని నిరసిస్తూ ఆదివారం జడ్చర్ల తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది నిర్వహించిన వేడుకలకు ఉద్యమకారులకు ప్రత్యేక ఆహ్వానం పంపి ఉచిత బస్సు కల్పించిన ప్రభుత్వం నేటి వేడుకలు ఎందుకు విస్మరించిందని ప్రశ్నించారు. ప్రభుత్వ హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలన్నారు. కావలి రమేష్, బాలరాజ్, యాదయ్య పాల్గొన్నారు.

ఒబేదుల్లా కొత్వాల్ జన్మదినం



శుభాకాంక్షలు తెలుపుతున్న ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్

మహబూబ్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ జన్మదినాన్ని ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మీడియా సెల్ ఇన్‌చార్జి సీజె బెనహర్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంనాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిబాబ, గౌడ సంఘం నాయకుడు కుమార్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు.

ఇసుక టిప్పర్ అడ్డగింత

మిడ్జిల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారు నుంచి నిత్యం అనుమతుల పేరుతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి అన్నారు. బాలానగర్ మండలం పెద్దరేవల్లికి ఇసుకను తరలించేందుకు అనుమతులు పొంది రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలానికి ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం అడ్డుకున్నారు. ఇసుక తరలింపుపై విచారణ చేపట్టాలన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

హన్వాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : హన్వాడ, మహమ్మదాబాద్ మండలాల పార్టీ సభ్యులకు ఒక్క రోజు రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం హన్వాడ మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా తిరుమలగిరి రాములు వ్యవహరించారు. తరగతులకంటే ముందు సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మయ్య పహల్గాం దాడిలో మృతి చెందిన వారికి సంతాపం ప్రకటించారు. ప్రతీ మండలంలో పార్టీని విస్తరించేందుకు కృషి చేయాలన్నారు. మధ్యాహ్నం శాస్త్రీయ ఆలోచన క్లాసు సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు బోధించారు. ప్రతి పార్టీ సభ్యుడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి ప్రజల మధ్య ఉండి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు నర్సిములు, నాయకులు రాజు, రమణయ్య, రేఖమయ్య, చిన్నయ్య, రవి, గోవిందమ్మ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు

» చిన్నకారు రైతులకు ప్రోత్సాహం » నూతన సాగుకు దరఖాస్తులు



గార్లపాడ్‌లో సాగైన ఆయిల్ పామ్ పంట

జిల్లాలో మరో 1500 ఎకరాలు

2025-26 సంవత్సరానికి జిల్లాలో నూతనంగా 1500 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలు పెంపకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జడ్చర్లలో 550 ఎకరాలు, దేవరకద్రలో 550 ఎకరాలు, మహ బూబ్‌నగర్‌కు 400 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటల పెంపకానికి లక్ష్యం కేటాయించింది. దీంతో ఆయిల్ పామ్ తోటల పెంపకానికి రైతులు దరఖాస్తులు చేసుకొంటున్నారు.

స్వప్న, ఉద్యాన అధికారి

కోయిలకొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ పంట సాగు రైతుకు అధిక లాభాలు తెస్తున్నాయి. దీంతో ఆరుతడి పంటలైన ఆయిల్ పామ్‌ను పెంచేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయిల్ పామ్ మొక్క నాటిన 4 సంవత్సరాలకు క్రాప్ ప్రారంభమవుతోంది. దీంతో మండలంలోని 294 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తుండగా, మండలంలోని గార్లపాడ్, అయ్యవారిపల్లిలో ఆయిల్ పామ్ క్రాప్‌కు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్ పామ్ పంట 25 నుంచి 30 సంవత్సరాలు రైతుకు క్రాప్ అందిస్తోందని ఉద్యానవన అధికారులు తెలిపారు. ఆయిల్ పామ్ తోటల పెంపకానికి ప్రభుత్వం ఐదెకరాల్లోపు రైతులకు 90 శాతం, ఐదెకరాలు దాటిన రైతులకు 80 శాతం రాయితీ అందిస్తోంది. దీంతో పాటు తోటలు ప్రారంభించిన నాటి నుంచి ఎకరాకు రూ.4,200 చొప్పున నాలుగేళ్లకు రూ.16,800 ప్రభుత్వం రైతుకు ప్రోత్సాహం సైతం అందిస్తోంది. పంటకు నీరు అందించేందుకు డ్రిప్‌కోసం ఎస్సీ, ఎస్టీకి వందశాతం, బీసీ, చిన్నకారు, ఓసీ రైతులకు 90 శాతం రాయితీతో అందిస్తున్నారు. మండలంలోని గార్లపాడ్‌కు చెందిన రైతు సుధాకర్‌రెడ్డి ఆయిల్ పామ్ తోట క్రాప్ ప్రారంభం కాగా, ఇప్పటి వరకు 17 టన్నుల వరకు ఫ్రీ యూనిక్ కంపెనీకి పంటను విక్రయించారు. ఆయిల్ పామ్ గింజలకు కేంద్రం ప్రభుత్వం టన్నుకు రూ.20,050 కేటాయించడంతో కంపెని వారు రైతుల వద్ద నుంచి అదే ధరతో కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు రైతులు ఆయిల్ పామ్ తోట మధ్యలో అంతర్‌పంటలు సాగు చేసి లబ్ధి పొందుతున్నారు.





జడ్చర్ల, రాజాపూర్‌లో సమ్మేళనమైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనమైన అప్పంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు

జడ్చర్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1993-96 బ్యాచ్‌కు చెందిన బీఎస్సీ విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. 40 మంది విద్యార్థులు 30 సంవత్సరాల తర్వాత కళాశాలలోని అలుమ్ని అసోసియేషన్ హాల్‌లో సమావేశమై ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరి క్షేమ సమాచారాలు మరొకరు పంచుకున్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన తెలంగాణ బొటానికల్ గార్డెన్ సందర్శించారు. గార్డెన్ సమన్వయ కర్త డాక్టర్ సదా శివయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గార్డెన్‌కు అవసరమైన నెట్ హౌస్‌ను తామే రూ.2 లక్షల వ్యయంతో నిర్మిస్తామని తెలిపారు. తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో తమ జ్ఞాపకార్థం ప్రతీ పూర్వ విద్యార్థి ఒక మొక్క నాటి నీళ్లు పోశారు. ఇటీవల జీవవైవిధ్య పరిరక్షణ అవార్డు పొందిన రమాదేవిని శాలువాలతో సత్కరించారు. పూర్వ విద్యార్థులు భాస్కర్, డాక్టర్ సరయు, భరత్ గౌడ్, వెంకటేశ్వర్ రావు, సర్దార్ నాయక్, చింతకాయల నాగరాజు, నాగిరెడ్డి, నాగేందర్, లక్ష్మీ, స్వరూప, నీలిమ, ఇందుమతి, ఉమాదేవి, ఇందర పాల్గొన్నారు.

● రాజాపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2007-08 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమ్మేళనమయ్యారు. ఈ సందర్భంగా ఆ నాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. శంకర్, శ్రీకాంత్, ఖాయుమ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

● చిన్నచింతకుంట : కౌకుంట్ల మండలం అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2004-05 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అంతకుముందు అప్పటి గురువులు శ్రీనివాసులు, మురళీధర్‌రెడ్డి, తిరుపతయ్య, విజయకృష్ణ, వెంకటరత్నం, గోవర్ధన్, మహిపాల్, అనితను పూల మాలతో సన్మానించారు. పూర్వ విద్యార్థులు చల్మారెడ్డి, భాస్కర్, నరేందర్, రమేష్, మహేందర్, కవిత, శశికళ, సంధ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



బాధిత కుటుంబీకులకు డబ్బులు ఇస్తున్న పూర్వ విద్యార్థులు

చిన్నచింతకుంట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పంపల్లికి చెందిన లక్ష్మీకాంత్‌రెడ్డి ఇటీవల మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు 1992-93 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.2.11 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. జగదీశ్వర్ రెడ్డి, రవిగౌడ్, అశోక్‌రెడ్డి, నరసింహారెడ్డి, మధు సూదన్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

దాది బంజారా సేవా సంఘం కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీతో నాయకులు

పాలమూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : దాది బంజారా సేవా సంఘం కమిటీని ఆదివారం శివునిగుడి తండాలో ఏర్పాటు చేసిన సాధారణ సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.వెంకటేష్ నాయక్, ఉపాధ్యక్షుడిగా డి.విజయ్ నాయక్, ప్రధాన కార్యదర్శి డి.గోవిందు నాయక్, కోశాధికారిగా డి.వెంకటేశ్ నాయక్, సంయుక్త కార్యదర్శిగా కాళిదాసు నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా శ్రీను, వినోద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తండా అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు.

బీసీ మహాసభ జిల్లా కమిటీ ఎన్నిక

పాలమూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బీసీ మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా పసుల రమాదేవిని ఎంపిక చేసినట్లు జాతీయ అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ ప్రకటించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా విభాగం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా పసుల రమాదేవి, ఉపాధ్యక్షురాలిగా కె.మంజుల, కె.జ్యోతి, మేకల అరుణ, ప్రధాన కార్యదర్శిగా జి.మాధవిలత, కార్యదర్శులు బి.జయమ్మ, కె.పద్మ, కె.ప్రసన్న, సంయుక్త కార్యదర్శిగా యం.మంగమ్మ, పి.అనురాధ, కోశాధికారి కాంచనమాల, ప్రచార కార్యదర్శి బి.శిరీష, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంగల్ల భవాని, కె.రాజేశ్వరిగౌడ్, జాంగ్ర సరోజ, వడ్ల బాలమణి, సభ్యులుగా కల్పన, శ్రీలత, నిర్మల, జి.శారద, కె.సరస్వతి, బాలమణి, ఉమ, లక్ష్మి ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి బ్రహ్మయ్య, హరి ప్రకాష్‌గౌడ్, కుర్మయ్య, ఉమ, చంద్రకళ, ప్రభాకర్, బుగ్గయ్య, బస్వరాజు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నందున ఈ సోమవారం జరిగే ప్రజావాణి రద్దు చేసినట్లు ఆమె తెలిపారు. ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

కోయిలకొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొతలాబాద్ గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు అందించారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు జోరుగా ప్రచారం చేస్తున్నా. విద్యాశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రాడ్యుయేట్ అసోసియేషన్ అధ్యక్షుడు శోభన్‌బాబు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా పుట్టగొడుగుల్లా ప్రైవేట్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మండల స్థాయిలో ఎంఈవోలు వసూలు రాజాలుగా వ్యవహరిస్తున్నారని, దీనికి తోడు డీఈవో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు చేయి తడపనిదే పనులు చేయడం లేదన్నారు. నిర్లక్ష్యం వీడి గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు రవి, నరేష్, శుభాష్ పాల్గొన్నారు.

చిన్నారుల నృత్య ప్రదర్శన అదుర్స్



నృత్యం చేస్తున్న చిన్నారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ట్యాంక్ బండ్ సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సై డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్టేట్ లెవల్ డ్యాన్స్ కాంపిటీషన్స్ అదిరాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 100 మంది డ్యాన్సర్లు తమ ప్రతిభను ప్రదర్శించారు. కరీంనగర్, అదిలాబాద్, నల్గొండ, రాయచూర్, ఉమ్మడి పాలమూరు జిల్లాల నుంచి డ్యాన్సర్లు పాల్గొన్నారు. ఉదయం ప్రారంభమైన డ్యాన్స్ పోటీలు రాత్రి పొద్దుపోయే వరకు సాగాయి. గ్రూప్ డ్యాన్స్, డ్యూయెట్, సోలో విభాగాల్లో డ్యాన్సర్లు పోటీ పడ్డారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సై డ్యాన్స్ స్టూడియో మాస్టర్ తిరుపతి రాజ్, చీఫ్ గెస్ట్‌గా ప్రముఖ కొరియో గ్రాఫర్ యశ్వంత్ మాస్టర్ వ్యవహరించారు. గ్రూప్ డ్యాన్స్‌లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన వారికి ప్రైజ్ మనీగా రూ.30 వేలు అందించారు. డ్యూయెట్‌లో ప్రతిభ కనబర్చిన వారికి రూ.15 వేలు, సోలో ఉత్తమ ప్రదర్శనకు రూ.5 వేలు అందించారు. ఈ సందర్భంగా మాస్టర్ తిరుపతి రాజ్ మాట్లాడుతూ ప్రతీ ఏటా వేసవిలో గ్రామీణ ప్రాంతాల చిన్నారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఈ పోటీలు శిల్పారామం వేదికగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీలలో 100 మంది డ్యాన్సర్లు ప్రదర్శన ఇచ్చారన్నారు. వారితో పాటు ఔత్సాహికులు సుమారు 1000 మందికి పైగా పాల్గొన్నారన్నారని తెలిపారు. వారందరికి మా స్టూడియో బృందం అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే స్థల పరిశీలన



అయ్యప్ప గుట్ట వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మూసాపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అయ్యప్ప గుట్ట పరిసరాల్లోని ప్రభుత్వ భూమిలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. 6న సబ్‌స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరుకానుండటంతో స్థల పరిశీలనతో పాటు కావల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని భూత్పూర్ మండలంలో తాటిపర్తి, మదిగట్ల, అమిస్తాపూర్, అడ్డాకుల మండలంలో కందూరు, గుడిబండ, ముత్యాలంపల్లి, మూసాపేట మండలంలో మూసాపేటతో పాటు పోల్కంపల్లిలో 33/11 కేవీ సబ్ స్టేషన్లు, మూసాపేటలో 33తో పాటు 132/11 కేవీ రెండు కేంద్రాలు మంజూరైనట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ ఎంపీపీలు బగ్గి కృష్ణయ్య, నాగార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సూదిరెడ్డి లక్ష్మికాంత్‌రెడ్డి, నల్ల తిరుపతయ్యగౌడ్, లక్ష్మీనారాయణ, రాంచందర్, గడ్డం మహేందర్, కృష్ణయ్య, శెట్టి శ్రావన్, ఉట్కూర్ ఖలీల్ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్సులో రాణించాలి : డీఎస్పీ



శిక్షణ పొందిన విద్యార్థులతో డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మార్షల్ ఆర్ట్సులో విద్యార్థులు రాణించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. కింగ్ షోటోకాన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని షాసాబ్‌గుట్టలో వేసవి కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరై శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రతి ఏడాది ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించి విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ నేర్పడం అభినందనీయం అన్నారు. ప్రస్తుత సమాజంలో ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుడ్యం పెంపొందుతుందన్నారు. ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకుంటు, గుర్తింపు ఉన్న క్రీడలను ఎంపిక చేసుకొని అందులో రాణించాలన్నారు. అంతకుముందు విద్యార్థులు కరాటే విన్యాసాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ ఏజజుద్దీన్, కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ, వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, సయ్యద్ తఖీయోద్దీన్, యోగా కోచ్ బాలమణి పాల్గొన్నారు.

'నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడాలి'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్న నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా ప్రతీ ఒక్కరు ఉద్యమించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాములు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రైస్‌మిల్లర్ అసోసియేషన్ కార్యాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించే ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శాస్త్రీయ విద్యావిధానం అమలు కోసం ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాడుతోందని, విద్యార్థులకు ఎలాంటి సమస్యలు వచ్చినా ఎస్‌ఎఫ్‌ఐ ముందుడి పోరాటం చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్, ఉపాధ్యక్షుడు కిరణ్, శ్రీకాంత్ వర్మ, ప్రశాంత్, కన్వీనర్ పూజ, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, భరత్, ఉపాధ్యక్షుడు నందు, రమేష్, రాజేష్, రాధిక, నవ్య, శ్రీనాథ్ పాల్గొన్నారు.

కేజీబీవీ వర్కర్లను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న టీయూసీఐ నాయకుడు అరుణ్‌కుమార్

పాలమూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కేజీబీవీ వర్కర్లను ప్రభుత్వం తక్షణమే పర్మినెంట్ చేయాలని తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ (టీయూసీఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హాస్టల్లో పనిచేస్తున్న వర్కర్లకు ఇచ్చే వేతనం రూ.9,750 కుటుంబం గడవడం కష్టంగా మారిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం పద్ధతిలో జీతాలు పెంచాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ చేయాలన్నారు. వర్కర్స్‌తో వారి డ్యూటీలు తప్ప వేరే పని చేయించరాదన్నారు. కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మౌనిక, అలివేల, రజిత తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

జడ్చర్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా 50 కిలోల బస్తా రూ.300, ఫసల్ బీమా పథకం, రైతుబంధు ద్వారా సంవత్సరానికి మూడు పంటలకు రూ.6 వేలు అందించడం, వర్షాకాలం పంటలు వేయకముందే మద్దతు ధర ప్రకటించడంతో ఆదివారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆలూరు గ్రామం కొత్తతండాలో రైతులతో కలిసి నాయకులు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆలూరు శేఖర్‌రెడ్డి, ఎంటీ బాలకృష్ణ, రామునాయక్, హన్మియా నాయక్, దేశ్య, మణి, బుజ్జి, గోరి, సక్రి, శారద పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిడ్జిల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మున్ననూరుకు విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, రైతులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సబ్‌స్టేషన్ దోహదపడుతుందని పలువురు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ జంగయ్య, వెంకటయ్య, మల్లికార్జున్‌రెడ్డి ఉన్నారు.

సంకల్ప సిద్ధి అయ్యప్ప సేవా సమితి కమిటీ ఎన్నిక

మూసాపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సంకల్పసిద్ధి అయ్యప్ప సేవా సమితి మూసాపేట మండల శాఖ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నామాల మశ్చంధర్‌నాథ్, ప్రధాన కార్యదర్శిగా గూపని కొండయ్య, కోశాధికారిగా మిడ్జీల విశ్వేశ్వర్‌నాథ్, గౌరవ అధ్యక్షుడిగా తూమ్ శ్రీకాంత్‌రెడ్డి, నల్ల తిరుపతయ్యగౌడ్, అమ్మిక భాస్కర్ చందర్‌గౌడ్, శెట్టి చంద్రశేఖర్, సాయిరెడ్డి, ముచ్చర్ల యాదయ్యశెట్టి, జంగం మధు, గడ్డం మహేందర్, ఉపాధ్యక్షుడిగా కొంగరి శ్రీనివాసులు, ఎం.ప్రభాకర్, పల్లె చంద్రమోహన్, రాములు, ఎర్ర తిరుపతయ్య, ఎం.గౌతమ్‌గౌడ్, రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎం.రాజుగౌడ్, వెంకటాంపల్లి రాజు, సంయుక్త కార్యదర్శులుగా పటేల్ నర్సింహారెడ్డి, బత్తుల సతీష్, నరహరి, పల్లె రవి, కందూరు శేఖర్‌రెడ్డి, భీమయ్య, ప్రచార కార్యదర్శులుగా జి.సతీష్‌సాగర్, రఘు, శ్రీహరి, గౌరవ సలహదారులుగా ఎస్ఆర్ కిశోర్ ఎన్నికయ్యారు.